క్లుప్తంగా

రోడ్డు విస్తరణకు కొలతలు



రోడ్డుకు కొలతలు వేస్తున్న అధికారులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని పెంజర్ల రోడ్డు విస్తరణలో భాగంగా అధికారులు శనివారం కొలతలు నిర్వహించారు. వ్యాపార సముదాయాల ఎదుట వేసిన రేకులు, షెడ్లను ఇప్పటికే యాజమానులు స్వతహాగా తొలగించారు. ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు తమకు కూడా అన్యాయం జరగకుండా విస్తరణ చేపట్టాలని పలువురు పేర్కొంటున్నారు. కాగా, రోడ్డును ఎంతమేర విస్తరణ చేస్తారనే విషయం త్వరలో ప్రకటించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

ప్రొటీన్ బాక్స్‌ల అందజేత



ప్రొటీన్ బాక్స్‌లను అందజేస్తున్న దృశ్యం

షాద్‌నగర్: మండల పరిధిలోని దొంతికుంట తండా, రంగంపల్లి, కందివనం గ్రామాల్లో శనివారం బీజేపీ నేత, పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గర్భిణులు, బాలింతలకు ప్రొటీన్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ... పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే అందరు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని చెప్పారు. తద్వారా పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఎదుగుతారని అన్నారు. అదే విధంగా నిరుపేదలను ఆదుకోవాలనే లక్ష్యంతో చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌భాస్కర్, ప్రదీప్, అంజయ్య, శ్యాం సుందర్‌రెడ్డి, విజయ్, అజయ్, శివ, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న అంజయ్య

షాద్‌నగర్‌టౌన్: సీఎం సహాయనిధి నిరుపేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన వెంకటకృష్ణ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక సహాయం అందించాలని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి నుంచి రూ.60వేలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మంజూరైన చెక్కును శనివారం ఎమ్మెల్యే లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్‌పాల్గొన్నారు.

కంటి వెలుగును విజయవంతం చేయండి



సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ మహేష్‌బాబు సూచించారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు అందజేశారు. గర్భిణీ, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందరికి అందేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, జయలక్ష్మి పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



పరిశ్రమలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

షాబాద్: క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈస్టర్ ఈవెంట్ జనరల్ మేనేజర్ నాగేష్ కాలె పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని హైతాబాద్‌లో గల ఈస్టర్ పరిశ్రమలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా సూరజ్ బిల్డ్‌కాన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం పొగాకు వ్యతిరేక నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. క్యాన్సర్‌కు గల కారణాలను వివరిస్తూ, క్యాన్సర్ పట్ల ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు.

టమాట రైతుకు 'ధరా'ఘాతం



చాకలిగూడ సమీపంలో టమాట చేనులో మేస్తున్న గొర్రెలు



కనకమామిడిలో వదిలేసిన టమాట తోట

- రేటు లేక పంట పొలాల్లోనే దిగుబడి
- పశువులకు మేతగా వాడుతున్న వైనం

మొయినాబాద్‌రూరల్: నిన్నమొన్నటి వరకు మంచి ధర పలికిన టమాట అమాంతంగా పడిపోయింది. రోజు రోజుకు పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పంటపొలాల్లోనే టమాట దిగుబడిని వదిలేశారు. మరికొందరైతే పశువులకు మేతగా వాడుతున్నారు. మొన్నటి వరకు కిలో రూ.20–30 ధర పలికిన టమాట నేడు మార్కెట్‌లో అమ్మకానికి వెళితే రూ.5–6కు చేరింది. ఆరుగాలం కష్టపడి ఆటుపోట్లు ఎదుర్కొని పండించిన పంట అమ్మితే రవాణా ఖర్చులు కాదుకదా.. కూలీలు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల్లో చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో టమాట ఎక్కువగా సాగు చేస్తున్నారు. మొయినాబాద్ మండలంలోని కనకమామిడి, తోల్‌కట్ట, నక్కలపల్లి, ఎత్మార్‌పల్లి, చాకలిగూడ, అమ్డాపూర్, ముర్తుజాగూడ, చిన్నమంగళారం, బాకారం ఆయా గ్రామాల్లో రైతులు డ్రిప్ సిస్టిమ్ ద్వారా సాగు చేశారు. పంట చేతికి వచ్చాక మార్కెట్‌లో అమ్ముదామంటే కనీస మద్దతు ధర లభించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆదాయం అంతంతే..

ప్రస్తుతం మార్కెట్‌లో 20 కిలోల పెట్టెధర రూ.80–100 పలుకుతుంది. ఎకరం సాగుకు రూ.30–40 వేలు ఖర్చు అవుతాయి. రోజు పొలంలో టమాటలు తెంపడానికి ఒక్కో కూలీకి రూ.400–500 వరకు ఇస్తున్నామని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో అమ్మితే కూలీ ఖర్చు కాదు రవాణా ఖర్చు కూడా రావడం లేదు. పంటకు తెగుళ్లరాకుండా జాగ్రత్తలు తీసుకొని భారీగా పెట్టుబడులు పెట్టిసాగు చేస్తే సరైన ధర లేదని టమాట రైతుల బాధపడుతున్నారు. ప్రభుత్వం రైతులకు పండించే పంటలకు సరైన మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధర కల్పించి అండగా నిలవాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

పశువులకు మేతగా వేస్తున్నాం



మండలంలో అనేక గ్రామాల్లో రైతులు కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర వస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తారు. కానీ, ఫిబ్రవరి నెలలో రైతులు పండించిన టమాటకు ధరలు లేక పంటపొలాల్లోనే వదిలేస్తున్నాం. పంటలు పండించే పెట్టుబడి వదిలేసిన కూలీ ఖర్చులు, కిరాయిలు రావడం లేదు. కనకమామిడిలో ఇప్పటికే ఎంతో మంది పశువులకు మేతగా వాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులు అప్పుల పాలు కాకుండా మద్దతు ధర కల్పించే విధంగా చూడాలి

– బాలకృష్ణారెడ్డి, రైతు, కనకమామిడి

లోక్ అదాలత్‌లో 156 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న సాంబమూర్తి, ట్రాఫిక్ సీఐ వాసు, బాధితులు

చేవెళ్ల: ట్రాఫిక్ కేసులపై చేవెళ్లలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో శనివారం మూడవ రోజు 156 కేసులు పరిష్కరించినట్లు రిటైర్డ్ జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసుల పరిష్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహన దారులు కేసులు పరిష్కరించుకునేందుకు ఈ లోక్ అదాలత్ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 156 కేసులు పరిష్కరించి వారికి 3లక్షల 81వేల జరిమానా విధించినట్లు చెప్పారు. ఇంకా కొన్ని రోజుల పాటు లోక్ అదాలత్ కొనసాగుతుందని సంబంధిత కేసులు పరిష్కరించుకోవాలని కోరారు. ఎవరికైనా సమాచారం లేకపోయిన వారు నేరుగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కేసులు తెలుసుకొని పరిష్కరించుకోవాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వాసు తెలిపారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలని నిరసన



నిరసన కార్యక్రమానికి తరలివెళ్తున్న యువజన కాంగ్రెస్‌నేతలు

యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సుధీర్

షాద్‌నగర్: నిరుద్యోగ భృతిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని షాద్‌నగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కాట సుధీర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. షాద్‌నగర్ నుంచి పెద్ద ఎత్తున యువజన కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామని చెప్పి నాలుగేళ్లు అవుతున్నా ప్రభుత్వం ఎందుకు నిధులు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యలు అభ్యసించిన చాలా మంది యువత ఉపాధి లేకపోవడంతో నిరుద్యోగులుగా మారారని అన్నారు. వారందరికి ప్రభుత్వం ఉపాధి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ రంగంలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి తరలివెళ్ళిన వారిలో నాయకులు మహేష్‌గౌడ్, శివప్రసాద్, ఆవుల శ్రీకాంత్, నవీన్ నాయక్‌లు ఉన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు డిమాండ్ చేశారు. శనివారం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, స్థలం ఉన్న వారికి ఐదు లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా మున్సిపాలిటీ, గ్రామాల్లో ఇప్పటి వరకు ఏ ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. అలాగే, ఇళ్ల స్థలాలు ఉన్న వారికి మూడు లక్షలు ఇస్తామన్న హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఎంతో మంది పేదలు ఇళ్లు లేక గుడిసెల్లో జీవిస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. అనంతరం తహసీల్దార్ గోపాల్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీను నాయక్, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయక్, కుర్మయ్య, సాయి, మైలారం జంగయ్య, కృష్ణయ్య, ఆములు, మహేష్, పాండు, కిషన్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

శంకర్‌పల్లి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని శంకర్‌పల్లి జెడ్పీటీసీ గోవిందమ్మగోపాల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరహరిలు అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని మహాలింగాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు దాత కోమటిరెడ్డి లక్ష్మీనర్సింహ్మారెడ్డి స్టడీ మెటీరియల్, స్టేషనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. 10 వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భవాని, సర్పంచ్ మాణిక్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పెంటయ్య, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, యూత్ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గీత చదివితే.. రాత మారుతుంది..



గీతా పారాయణాన్ని పఠిస్తున్న సభ్యులు

విష్ణు సహస్ర పారాయణం అధ్యక్షుడు స్వరాజ్‌బాబు

షాద్‌నగర్‌రూరల్: ప్రతినిత్యం భగవద్గీతను చదివితే తలరాత మారుతుందని విష్ణు సహస్ర పారాయణం అధ్యక్షుడు స్వరాజ్‌బాబు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో గల శివహనుమాన్ దేవాలయంలో గత నాలుగు రోజులుగా ఆధ్యాత్మిక ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా గీతా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించి గీతా పారాయణాన్ని పఠించారు. అనంతరం స్వరాజ్‌బాబు మాట్లాడుతూ.....ప్రతిరోజు భగవన్నామ స్మరణచేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చేసిన ఉపదేశం మనమందరం తెలుసుకోవాలని అన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు ఆలోచనతో బయట పడాలే తప్పా ఆవేశంతో మాట్లాడవద్దని సూచించారు. ఎదుటి వారికి మోసం చేయకుండా ధర్మాన్ని పాటిస్తూ పది మంది మేలు కోరుతూ ముందుకు సాగితే మనం ప్రారంభించే అన్ని పనులలో విజయాలను పొందవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధికి ధాన ధర్మాలు చేయాలని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్ ఎంపీటీసీ శ్రీశైలం, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సునీతరాజు, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ చంద్రయ్య, రాజు, విష్ణు సహస్ర పారాయణం కోశాధికారి మాణిక్యం పాల్గొన్నారు.

తాగునీటి కోసం తండ్లాట



నీటి కోసం వేచిచూస్తున్న గ్రామస్తులు

నీరడిగితే దుర్భాషలాడిన సర్పంచ్

కొందుర్గు: గత నాలుగు రోజుల నుంచి తాగునీరు రావడం లేదని ముట్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చుక్కమెట్టు గ్రామస్తులు వాపోతున్నారు. నాలుగు రోజులుగా నీళ్ల రావడం లేదని తమ గ్రామానికి సరఫరా చేసే మిషన్ భగిరథ పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా ఆగిపోయిందని, దీంతో తాగడానికి నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో నివసించేది కేవలం దళిత కుటుంబాలే. 20 కుటుంబాలు దాదాపు 150 మంది వరకు ఇక్కడ జీవనం సాగిస్తారు. అయితే, గ్రామంలో ఉన్న సింగిల్ ఫేజ్ బోరుమోటర్ చెడిపోయింది. అదే విధంగా మిషన్ భగిరథ పైపులైన్ పగిలిపోయింది. దీంతో గ్రామస్తులకు నీటి కొరత తప్పలేదు. శనివారం గ్రామానికి చెందిన ఆగిర్యాల శేఖర్ సర్పంచ్ నర్సింహారెడ్డికి ఫోన్ చేశాడు. తమ గ్రామస్తుల నీటి కొరత తీర్చాలని కోరాడు. దీంతో స్పందిస్తూ రెండు రోజుల్లో మోటర్ బాగుచేయిస్తానని తెలిపాడు. అప్పటివరకు నీళ్ల ఎక్కడ తెచ్చుకోవాలని శేఖర్ అడగడంతో సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడారు. ఇంటి ఫోన్ సంభాషణకు సంబంధించిన ఆడియో వైరల్‌గా మారింది. చుక్కమెట్టు గ్రామస్తులు ఈ విషయమై విలేకరులకు విన్నవించి ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తిభావంతో ప్రశాంతత

రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు శ్రీహరియాదవ్



విగ్రహాలకు జలాభిషేకం నిర్వహిస్తున్న సర్పంచ్ మంజుల, తదితరులు

మొయినాబాద్‌రూరల్: భక్తిభావంతో మనశాంతి, ప్రశాంతత కలుగుతుందని మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీహరి యాదవ్, వైఎస్‌ఆర్‌టీపీ జిల్లా నాయకులు ముదిగొండ రాజయ్య, హిమాయత్‌నగర్ సర్పంచ్ మంజుల అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో మైసమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం 2వ రోజు శనివారం హోమంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాలకు జలాభిషేకం భక్తులు పెద్ద సంఖ్యలో నిర్వహించారు. వేదపండితులు పూజారులు మంత్రోచరణాల మధ్య అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులచే జలాభిషేకం నిర్వహించి పూలు, మహామంగళారతి సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. గ్రామ దేవతగా కొలిచే మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంజుల , నాయకులు రాఘవేందర్, బిస నర్సింహ్మ, విగ్నేష్‌గౌడ్, రాజుగౌడ్, విజేందర్‌గౌడ్, నాగేష్, వెంకటేష్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

లేగదూడలకు బ్రూసెల్లా టీకాలు

పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



లేగదూడలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: లేగదూడలకు బ్రూసెల్లా టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కేశవగూడ, ఎల్గొండగూడ, ముద్దెంగూడ, మల్లారెడ్డిగూడ, ఏట్ల ఎర్రవల్లి గ్రామాల్లో సిబ్బందితో కలిసి లేగదూడలకు బ్రూసెల్లా టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం పట్ల రైతుల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 4–8 నెలల వయస్సు కలిగిన లేగదూడలకు పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో బ్రూసెల్లా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

నందిగామలో దొంగల హల్‌చల్

- ఇంటి ఎదుట పెట్టిన బైక్ చోరీ
- వారం రోజుల్లో రెండు దొంగతనాలు

నందిగామ: మండల కేంద్రంలో దొంగలు రెచ్చిపోతున్నారు. నందిగామకు ఆనుకొని ఉన్న అంతిరెడ్డిగూడలో దొంగతనం జరిగి వారం రోజులు కూడా గడవకముందే పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో తాజాగా మరో దొంగతనం వెలుగులోకి వచ్చింది. ఇంటి ముందు పార్క్ చేసిన ఓ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన నందిగామలో శనివారం వెలుగులోకి వచ్చింది. నందిగామ ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం వివరాలు.. నందిగామకు చెందిన తుప్పుడు రజినీకాంత్ ఈ నెల 2వ తేదీ(గురువారం) రాత్రి తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేసి పరిశ్రమలో డ్యూటీకి వెళ్లాడు. అయితే, శుక్రవారం ఉదయం డ్యూటీ నుంచి వచ్చిన రజినీకాంత్‌కు తన బైక్ కనపడకపోవడంతో చుట్టు పక్కల వారిని, తెలిసిన వారిని బైక్ గురించి ఆరా తీశాడు. బైక్ వివరాలు తెలియక పోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడని. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.

ఇటీవల అంతిరెడ్డిగూడలో సైతం..

వారం, పది రోజుల క్రితం నందిగామకు అతిసమీపంలోని అంతిరెడ్డిగూడలో సైతం చోరీ చోటుచేసుకుంది. తాళం వేసి ఉన్న ఇంట్లోకి దొంగలు ప్రవేశించి బీరువాలోని నగదుతో పాటు, బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

ముదిరాజ్ సంఘం మండల కన్వీనర్ బాల్‌రాజ్

షాద్‌నగర్: ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం మండల కన్వీనర్ కుడుముల బాల్‌రాజ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో ముదిరాజ్ మహాసభ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఆర్థిక, సామాజిక, విద్యా, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. అందరు కలిసి కట్టుగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని చెప్పారు. అనంతరం సంఘం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రాములు, నర్సింలు, అధ్యక్షుడిగా అన్నారం జంగయ్య, ఉపాధ్యక్షుడిగా సత్తయ్య, మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కార్యదర్శిగా అంజయ్య, సహాయ కార్యదర్శులుగా శేఖర్, మల్లేష్, కోశాధికారిగా రవి, యువజన విభాగం అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా నరేష్, లింగం, ప్రధాన కార్యదర్శిగా శంకర్ తదితరులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోకన్వీనర్ సతీష్, యూత్ కన్వీనర్ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగడుతాం



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ శ్రీకాంత్

షాబాద్: ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగడుతామని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ సందిపని కన్వీనర్ బర్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఏబీవీపీ సమ్మేళనం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) శంషాబాద్ జిల్లా సమ్మేళనం ఈ నెల 6వ తేదీన ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ వాల్‌లో నిర్వహిస్తున్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ఏబీవీపీ శ్రీకారం చూడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్క విద్యార్థి జిల్లా సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, వావదీష్, రాఘవేందర్ తదితరులున్నారు.

శివనామస్మరణతో మార్మోగిన సంగమేశ్వర ఆలయం

ధ్వజారోహణలో సర్పంచ్ జనార్దన్‌రెడ్డి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం



మొయినాబాద్‌రూరల్: ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: శివ నామస్మరణతో కనకమామిడి సంగమేశ్వర దేవాలయ ప్రాంగణం మార్మోగింది. సంగమేశ్వర స్వామి మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం మొదటి రోజు రుద్రహోమం, విఘ్నేశ్వర స్వామి పూజ వేదపండితులు నిర్వహించి స్వామివారి మహోత్సవ కార్యక్రమాలను ధ్వజారోహణంతో ప్రారంభించారు. ఈ ధ్వజారోహణ పతాక, పూలమాల ఆవిష్కరణ గ్రామ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి పాల్గొని పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా వేదపండితులు, ఆలయ పూజారులు రుద్రాభిషేకం పూజలు చేశారు. శివలింగానికి, శివపార్వతులకు మహామంగళారతి సమర్పించి నైవేద్యాన్ని ఏర్పాటు చేశారు. విచ్చేసిన భక్తులకు మహా మంగలహారతి, స్వామి దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సంగమేశ్వర దేవాలయం భక్తులతో కిటకిటలాడుతూ శివనామస్మరణతో మార్మోగింది. ఎంపీటీసీ ప్రభావతిగణేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్, అంజిరెడ్డి, పద్మనాభం, వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, వేదపండితులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.